# సింగరేణికే గనులు కేటాయించాలి

**మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చిన కార్మిక సంఘాల నాయకులు**



కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రికిషన్‌రెడ్డిని కలిసి సింగరేణికి గనులు ఇవ్వాలని కోరుతున్న సింగరేణి కార్మిక సంఘాల నాయకులు

శ్రీరాంపూర్, జూలై 8 : తెలంగాణాలోని భూగర్భ గనులు సింగరేణికే కేటాయించాలని కోరుతు సోమవారం హైదరాబాద్‌లో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి సింగరేణి కార్మిక సంఘాల నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు బొగ్గు గనుల సెక్షన్ 11ఏ/17ఏ/ ఎంఎండీఆర్ 1957 ప్రకారం సింగరేణికి గనులు కేటాయించాలని కోరారు. సింగరేణి అన్వేషనా విభాగం గుర్తించిన కోయగూడెం, సత్తుపల్లి, శ్రావణపల్లికి ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తే ఓబీ పోయడానికి వారికి స్థలం లేదన్నారు. ఇల్లందు కోల్‌బ్లాక్ షెడ్యూల్ ఏరియాలో ఉందన్నారు. దానిని ప్రైవేట్ వాల్లకు కేటాయించడం చట్ట విరుద్దం అన్నారు. మిగిలిన బ్లాకులు అనేక సార్లు వేలంలో పెట్టినా ఎవరూ ఆసక్తి చూపలేదన్నారు. వాటిని నామినేషన్ పద్దతి ద్వారా సింగరేణికే కేటాయించాలని కోరారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నియామకం అయిన వెంటనే ఒడిశాలోని నైనీ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు మంజూరు చేయడంలో కృషి చేసినందుకు నాయకులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్ పెంచాలని, కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటి ఒప్పంద వేతనాలు అమలు చేయాలని, కోరడం జరిగిందన్నారు. మంత్రి కిషన్‌రెడ్డి తమ విజ్ఞప్తులను విని సానుకూలంగా స్పందించి సింగరేణికి అండగా ఉంటానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇక్కడ గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య, ప్రధానకార్యదర్శి రాజ్‌కుమార్, ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి జనక్‌ప్రసాద్, ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి, బీఎంఎస్ జాతీయ కార్యదర్శి పులిరాజారెడ్డి, రమాకాంత్‌రెడ్డి, రిటైర్డ్ పెన్షన్ సంఘం నాయకులు దత్తాత్రేయ, కేఆర్‌సీరెడ్డి, వికాస్‌కుమార్‌లు ఉన్నారు.

## సౌదీలో మామిడిపెల్లి వాసి మృతి



వెంకటేష్(ఫైల్)

దండేపల్లి, జూలై 8 : మండలంలోని మామిడిపెల్లి గ్రామానికి చెందిన పత్తిపాక వెంకటేష్(41) బతుకు దెరువు కోసం సౌదీఅరేబియా వెళ్లి అక్కడ మృతిచెందినట్లు కంపెనీ నుంచి సోమవారం తమకు సమాచారం అందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం...వెంకటేష్ గత యేడాది జూన్21న సౌదీఅరేబియా దేశానికి వెళ్లాడు. అకస్మాత్తుగా ఈనెల 3వ తేదీన ఉదయం 5గంటల ప్రాంతంలో ఫిట్స్ రావడవంతో తోటి ఉద్యోగులు సమీపంలోని దవాఖానకు తరలించారు. కోమాలోకి వెళ్లిపోవడంతో ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఈమేరకు కంపెనీ నుంచి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య సరిత, ఇద్దరు కూతుల్లు శ్రీవల్లి, అభిజ్ఞ ఉన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంకటేష్ మృతదేహాన్ని స్వగ్రామాన్ని తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

## కూలి డబ్బులు ఇవ్వాలని ఆందోళన



డబ్బా ఎక్స్ రోడ్‌పై బైఠాయించి రాస్తారోకో చేస్తున్న తునికాకు కూలీలు

చింతలమానేపల్లి, జూలై 8 : మండలంలోని డబ్బా గ్రామ పంచాయతీ పరిధిలోని డబ్బా ఎక్స్ రోడ్, ధరంపల్లికి చెందిన తునికాకు కూలీలు డబ్బా ఎక్స్ రోడ్ వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం వెంటనే తునికాకు కూలీలకు కూలీ డబ్బులతో పాటు బోనస్ డబ్బులు అందించాలని డిమాండ్ చేశారు. నెలలు గడుస్తున్న డబ్బులు రావడం లేదని గ్రామంలో సుమారు 80కి పైగా కుటుంబాలకు డబ్బులు రావల్సి ఉందని అన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి తునికాకు కూలీలకు డబ్బులు చెల్లించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని సూచించారు.

## విద్యుత్ షాక్‌తో ఆవులు మృతి

వేమనపల్లి, జూలై 8 : మండలంలోని మంగెనపల్లి గ్రామ శివారులో సోమవారం విద్యుత్ వైర్లు తెగి ఆవులపై పడడంతో విద్యుత్‌షాక్‌తో రెండు ఆవులు, రెండు లేగదూడలు మృతిచెందినట్లు ట్రాన్స్‌కో ఏఈ దీక్షిత్ తెలిపారు. ఎనగంటి చిన్నన్న ఆవు, లేగదూడ, గెడెం రాములుకు చెందిన ఒక లేగదూడ, ఆలం బక్కయ్యకు చెందిన ఒక ఆవు గ్రామ శివారులోమేత మేస్తుండగా ఒక్కసారిగా వర్షం పడడంతో విద్యుత్ వైర్లు తెగి ఆవులు, లేగదూడలపై పడడంతో షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందాయి. గ్రామస్తులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో వారు వచ్చి పరిశీలించారు. బాధితులకు ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం వచ్చేలా కృషి చేస్తామని ట్రాన్స్‌కో ఏఈ తెలిపారు.

## మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

సీసీసీ నస్పూర్, జూలై 8 : సీసీసీ నస్పూర్ గోదావరికాలనీ షిర్కె చౌరస్తాలో గల సింగరేణి సివిల్ ఆఫీస్ కార్యాలయ ఆవరణలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఇక్కడ ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి కొమురయ్య, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు వెంకటే శ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ రిలే నిరాహార దీక్షలు ప్రారంభం



శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్ ఎదుట నిరాహార దీక్ష చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్, జూలై 8 : శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్ ఎదుట ఏఐటీయూసీ నాయకులు గనుల ప్రైవేటీకరణ, వేలాన్ని వ్యతిరేకిస్తు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. నిరాహారదీక్షలను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కే శంకర్ ప్రారంభించగా ఎఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే వీరబద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచి కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా, గనుల ఫిట్ కార్యదర్శులు దీక్షలో పాల్గొన్నారు.

**గోలేటి జీఎం కార్యాలయం ఎదుట**

రెబ్బెన, జూలై 8 : తెలంగాణ బొగ్గు బ్లాకులు తెలంగాణలోని సింగరేణికే ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ఏరియా లోని గోలేటి జీఎం కార్యాలయం ఎదుట సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన దీక్షలు ప్రారంభించి మాట్లాడారు. ఇక్కడ ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్. తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్యా మొగిలి, సీపీ ఐ మండల సహాయ కార్యదర్శి జగ్గయ్య, జిల్లా వ్యవసా య కార్యదర్శి రాయిళ్ల నర్సయ్య, ఏఐటీయుసీ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, గడ్డం రమేశ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జూపాక రాజేశ్, కే.కిరణ్‌బాబు, దివాకర్, శేషు, ఓదేలు ఉన్నారు.

**మందమర్రిలో..**

మందమర్రి, జులై 8: బొగ్గు గనుల వేలాన్ని నిరసిస్తూ సింగరేణి మందమర్రి జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదట సోమవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. యూనియన్ ఫిట్ కార్యదర్శులు కంది శ్రీనివాస్, పి.బానయ్య, టేకుమట్ల తిరుపతి, గాండ్ల సంపత్, సీహెచ్.శర్మ, యాదవ్, గోపతి సత్యనారాయణ, సంజీవ్, శ్రీనివాస్‌లు దీక్షలు చేపట్టగా సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మన్, ఐటీయుసీ బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, భీమనాధుని సుదర్శన్, చిప్ప నర్స య్యాలు ముఖ్య అతిథిగా హాజరై దీక్షలను ప్రారం భించారు. కేంద్రం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ చేపట్టబోయే ఆందోళన కార్యక్రమాలలో సింగరేణి కార్మిక వర్గం పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

## ఇన్నోవేటర్ ద్వారా ప్రోత్సాహం

ఆసిఫాబాద్ టౌన్, జూలై 8 : ప్రభుత్వం చేపట్టిన ఇంటింటా ఇన్నోవేటర్-2024 కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజా ఉపయోగకరమైన ఆవిష్కరణలను ప్రోత్సహించడం జరుగుతుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ రాజస్వ మండల అధికారులు లోకేశ్వరరావు, కాసబోయిన సురేశ్‌లతో కలిసి ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అద్భుతమైన ఆలోచనలు, ప్రాజెక్టులు రూపొందించిన అన్ని వర్గాల ఆవిష్కర్తల నుంచి ఆవిష్కరణలను స్వీకరించడం జరుగుతుందని, గొప్ప ఆవిష్కరణలను ఎంపిక చేసి ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా సంబంధిత ఆవిష్కర్తలకు అవార్డు ప్రధానం చేయడం జరుగుతుందని తెలిపారు.

## కానిస్టేబుల్, హోంగార్డుకు ప్రోత్సాహకం

చెన్నూర్ రూరల్, జూలై 8 : చెన్నూర్ పోలీస్ స్టేషనల్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ భూమయ్య, రవి, హోంగార్డు అబ్దుల్ ఖదీర్‌కు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు నగదు ప్రోత్సాహాన్ని సోమవారం అందించారు. పోలీస్ స్టేషన్‌లో సాంకేతిక పరిజ్ఞానంతో జిల్లాలోనే నేర నియంత్రణ విభాగంలో వీళ్లు భాగస్వాములు అయ్యారని ఏసీపీ తెలిపారు. ఈ సందర్భంగా ఇద్దరు కానిస్టేబుళ్లకు, హోంగార్డుకు నగదు ప్రోత్సాహం అందించినట్లు తెలిపారు.

## అర్జీలను పరిష్కరించాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, జూలై 8 : వివిధ సమస్యలపై వచ్చిన అర్జీలను శాఖల వారీగా క్షుణ్ణంగా పరిశీలించి త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దా సరి వేణు, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ ఆర్డీవోలు లోకేశ్వరరావు, కాసబోయిన సురేశ్‌తో కలిసి అర్జీలు స్వీకరించారు.

**నస్పూర్, జూలై 8 :** నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, డీఆర్డీవో కిషన్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలను మంచిర్యాల అదనపు కలెక్టర్ మోతీలాల్ స్వీకరించారు. 54 అర్జీలు వచ్చాయని, వాటిని ష్కరించాలని ఆదేశించారు.



మంచిర్యాలలో అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

## నూతన ఎస్‌డీఎల్ యంత్రాలతో ఉత్పత్తి

శ్రీరాంపూర్, జూలై 8 : నూతన ఎస్‌డీఎల్ యంత్రాలతో గనిలో ఉత్పత్తి, ఉత్పాదకత గణనీయంగా పెరుగుతుందని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం శ్రీరాంపూర్ ఆర్కే 5గనికి ఏర్పాటు చేసిన 2నూతన ఎస్‌డీఎల్ యంత్రాలను జీఎం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏరియా సహాయ కార్యదర్శి కొమురయ్య, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఓటూజీఎం ఏవీ రెడ్డి, ఏరియా ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీవైజీఎం అరవింద రావు, గని మేనేజర్ అబ్దుల్ ఖాధర్ పాల్గొన్నారు.

## కొడుకును హత్య చేసిన తండ్రి

బెల్లంపల్లి, జూలై 8 : ఆస్తి పంచి ఇవ్వమని తరుచుగా అడుగుతున్నాడని సొంత కొడుకునే పారతో హత్య చేసిన సంఘటన సోమవారం బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆకెనపల్లి గ్రామానికి చెందిన దేవ మారాలుకు ఇద్దరు కుమారులు. మారాలుకు 21 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమిని పెద్ద కుమారుడు దేవ వినోద్(30) ఆస్తి పంచి ఇవ్వాలని గత నెల రోజుల నుంచి తండ్రితో గొడవపడుతున్నాడు. ఇదే విషయమై సోమవారం ఉదయం మరోసారి గొడవ జరిగింది. మధ్యాహ్నం ఆస్తి పంచడానికి పెద్ద మనుషులను తీసుకువస్తానని తండ్రి చెప్పాడు. మరల ఇదే విషయమై ఉదయం 10.30కు గొడవ జరిగింది. కొద్దిసేపటికి వినోద్ ఇంట్లో మంచం పై నిద్రించాడు. ఇదే అదనుగా భావించిన మారాలు పారతో తలపై గట్టిగా మోదాడు. రక్తపు మడుగులో ఉన్న వినోద్‌ను గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. వినోద్ తల్లి బీరక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## పోడు రైతులపై వేధింపులు ఆపాలి

చెన్నూర్, జూలై 8 : పోడు వ్యవసాయం చేసుకుంటున్న రైతులపై అటవిశాఖ అధికారులు వేదింపులు ఆపాలని బీజేపీ పార్లమెంటు కన్వీనర్ వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. చెన్నూర్‌లోని ఎఫ్‌డీవో రమేశ్‌కు సోమవారం వారు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోటపల్లి మండలంలోని సుమారు 16గ్రామాల్లో పోడు రైతులను అటవిశాఖ అధికారులు వేదింపులకు గురిచేస్తున్నారని ఆయన తెలిపారు. తక్షణమే వేదింపులను ఆపి రైతులు వ్యవసాయం చేసుకునేందుకు సహకరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కోటపల్లి మండల అధ్యక్షుడు మంత్రి రామయ్య, చెన్నూర్ పట్టణ అధ్యక్షుడు జాడి తిరుపతి పాల్గొన్నారు.

## కలర్ కార్డులను విరమించుకోవాలి

బెల్లంపల్లి, జూలై 8 : సింగరేణి యాజమాన్యం ప్రవేశపెట్టిన కలరు కార్డుల సర్క్యులర్‌ను విరమించుకోవాలని ఏఐటీయూసీ గని ఫిట్ కార్యదర్శి, బెల్లంపల్లి బ్రాంచ్ సహాయ కార్యదర్శి దాసరి తిరుపతి గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం మందమర్రి ఏరియాలోని శాంతిఖని గని ఆవరణలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. అనంతరం గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హాకు వినతిపత్రం సమర్పించారు. ఇక్కడ గని అసిస్టెంట్ కార్యదర్శి మంతెన రమేష్, ఉపాధ్యక్షుడు బుర్కా ప్రశాంత్, నాయకులు మిట్టపల్లి రమేష్, వెంకటయ్య, పి సురేష్, దాడి రమేష్, రత్నం ప్రవీణ్ పాల్గొన్నారు.

## యెల్లో, రెడ్ కార్డుల విధానం ఎత్తి వేయాలి

శ్రీరాంపూర్, జూలై 8 : సింగరేణి కార్మికులపై చర్యలు తీసుకోవడానికి జారీ చేసిన ఎయెల్లో, రెడ్ కార్డుల విధానం సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలని బీఎంఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు చాట్ల అశోక్, బ్రాంచి కార్యదర్శి ఈశ్వరచారిలు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇక్కడ ఏరియా ఉపాధ్యక్షుడు ఎన్ శ్రీధర్ పాల్గొన్నారు.

